ఉగాది మినీకథల పోటీలో మొదటి బహుమతి రు. 250/- పొందిన కథ

---

# గృహరాజు



**పీసపాటి చంద్రశేఖర్**

గుర్నాథం నడుస్తున్నాడు హడావుడిగా. ఎదుటనుండి వచ్చే వాహనాలకు దారియిస్తూ, వెనుక నుండి తనమీదకి ఏమీ దూసుకు రాకుండా చూసుకొంటూ, హడావుడిగా నడుస్తున్నాడు గుర్నాథం.

ఎండ తీవ్రస్థాయిలో వుంది. దానికి నిదర్శనంగా గుర్నాథం ముఖానికి అద్దిన పౌడరు ముఖానికి పట్టిన చెమటతో కలసి తెల్లటి రూపంలో జారి గుండెలమీద పడుతోంది. గుర్నాథం ముఖం మరింత నల్లబడి నిజరూపం పొందటానికి ఎంతో సమయం పట్టలేదు.

'రిక్షా ఎక్కినా బాగుండేది, ఈ పాటికి ఆఫీసుకు చేరుకొని వుండేవాడ్ని.' రోజూ నడిచే రోడ్డు అయినా ఆఫీసుకు ఆలస్యం కావటంతో దూరం ఎక్కువైనట్టు అనిపిస్తోంది గుర్నాథానికి.

'సమయానికి ఒక్క రిక్షా కూడా కన్పించలేదు. ఈ రోజు కూడా ఆలస్యమవుతూంది. నిన్న ఆఫీసరు నానా చివాట్లూ పెట్టాడు. ఈ రోజు మాత్రం ఏ కారణం చెప్పినా ఆఫీసరుకు కోపం రావటం తప్పదు.'

'ఒరేయ్, గుర్నాధం! నిన్నటి తిట్ల భాగోతానికి కంటిన్యుయేషన్ నీకు ఈ రోజు ఆఫీసు పలికే స్వాగత వాక్యం. కొంచెం నిబ్బరంగా వుండు!' ధైర్యం చెబుతోంది గుర్నాథం లోపలి గుర్నాథం.

చేతిలో టిఫిన్‌బాక్సు వెచ్చగా తగుల్తోంది. దానిని ఇంకో చేతిలోకి మార్చుకుని, వెచ్చబడిన చేతిని ముక్కుదగ్గర పెట్టుకొని గట్టిగా వాసనచూశాడు. ముక్కుకి వెచ్చదనంతప్ప మరేమీ తగలలేదు.

ఊహలు చేతిని వదలి టిఫిన్ బాక్సులోకి పరుగుపెట్టాయి. 'విశాలి ఇడ్లీ చెట్నీ ఎంత బాగా చేస్తుంది!' మరోసారి చేతిని గట్టిగా వాసన చూసుకొన్నాడు. మనసులో ఊహలు చేతిలోకి పరుగుతీసి ఇడ్లీ చెట్నీకి సంబంధించిన కమ్మటి వాసనల్ని అతనికి అందించాయి. తృప్తిగా నిట్టూరుస్తూన్న సమయంలో....

"ఏం పంతులూ! బతకాలని లేదా? ఎనకాల పెళ్ళాం పిల్లలు లేరేంటి? కొంచెం చూసుకొన్నడూ!"

గుర్నాథం ఈ లోకంలోకి వచ్చాడు. 'అమ్మో! ఏదైనా జరిగి వుంటే ఇంకేమైనా వుందా! ఆఫీసరు చెడ్డ తిడతాడు. సెలవు కూడా యివ్వడు. కుంటుతూ ఆఫీసుకి రమ్మంటాడు. విశాలి, పిల్లలు ఎంత గాబరా పడ్తారు. నా మీద బెంగతో విశాలి ఇడ్లీలు చెయ్యటం మానేస్తుంది. ఇడ్లీ, చెట్నీ లేకపోతే విశాలి, పిల్లలు ఈ లోకమే గుర్తుకురారే!'


టైము చూసుకొన్నాడు. 'మూడు నిమిషాలు ఆలస్యం అయిందప్పుడే. ఇంకా ఫర్లాంగు దూరం నడవాలి. ఇదేవిటి ఇంత స్పీడుగా నడుస్తున్నా తరగడం లేదీవేళ రోడ్డు! ఈవేళ ఆఫీసు గడియారం ఆగిపోతే బాగుండును. అయినా ఆఫీసరు వాచి వుంటుందిగా! ఆయన వాచ్ ప్రకారమే ఆఫీసు గడియారం కూడా తిరుగుతుంది.

పోనీలే. ముందు యాక్సిడెంటునుంచి బయటపడ్డాను కదా! విశాలి, పిల్లలు నాకు దక్కారు. నేను వాళ్ళకు దక్కాను! బోడి ఆఫీసరు తిట్లు మామూలే. అదేదో సినిమాలోలాగ చెవులో మిషను పెట్టుకొంటే గొడవుండదు. ఇంటికొచ్చేక తీసిపారెయ్యొచ్చు.'

ఆలోచనల పడవలో ప్రయాణంచేసి ఆఫీసు ఆవరణలోకి అడుగుపెట్టాడు గుర్నాథం.

నెమ్మదిగా ఆఫీసు వరండాలోకి చేరుకొన్నాడు. అంతా నిశ్శబ్దంగా వుంది. హాలులోకి చేరాడు. చుట్టూ చూశాడు. అంతా యెవరి పనుల్లోవాళ్ళు మునిగి వున్నారు. ఒకచోట ఒకే ఒక కుర్చీ మాత్రం ఖాళీగా వుంది. 'అమ్మయ్య! యింకా యెవరో రావలసి వుందికదా! నా బాధలు పంచుకొనే ఆపద్బాంధవుడు ఒకడున్నాడు.' అనుకొని వెంటనే ఆ కుర్చీ తనదే అని తెలిసి కంగారుగా అక్కడికి చేరుకొని కుర్చీలో కూలబడ్డాడు.

అందరూ నిశ్శబ్దంగా యెవరి పనులు వాళ్ళు చేసుకోవడం. తనను ఎవరూ పట్టించుకోకపోవటం చూసేసరికి గుర్నా



## నా గురించి

పేరు పీసపాటి చంద్రశేఖర్. ప్రస్తుతం కాకినాడలో శ్రీమతి పైండా ఆండాళమ్మ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్నాను.

జన్మస్థలం తూర్పు గోదావరి జిల్లా రాయవరం తాలూకా లొల్ల. విద్యాభ్యాసం రాయవరం, రామచంద్రపురం, విశాఖపట్నం. చలంగారి నవలలు, రచనలు, శ్రీశ్రీ "మహాప్రస్థానం" పదే పదే చదవటం అలవాటు.

రచనా వ్యాసంగంతో పరిచయం చాలా కాలంనుంచి వుంది. పోటీలలో పాల్గొనటం యిదే ప్రథమం.

—పీసపాటి చంద్రశేఖర్

థంకు అనుమానం కలిగింది.

ప్రక్కనే ఆఫీసరు గదిలోంచి టైపు మిషను చేస్తున్న చప్పుడు, హాలులో మరో ప్రక్క సూపరింటెండెంటు తలపైన తిరుగుతున్న ఫ్యాను చేసే కిర్ కిర్‌ల శబ్దాలు. ఆ శబ్దాలకు విసుక్కొని సూపరింటెండెంటుగారు లెఖ్ఖలు తప్పు చూడటం, ఆ బాధతో ఆఫీసు స్టాఫ్ అందరిమీద విసుక్కోవడం పరిపాటి.

'ఈ రోజు అలాంటిదేదో ఈ పావుగంటలో జరిగివుండాలి. లేదా ఆఫీసరు ఎవర్నయినా కేక లేశాడేమో! ఎవర్నో ఎందుకు నన్నే కేకలేసి వుంటాడు అయినా ఒక వ్యక్తి లేనప్పుడు అతని ఆబ్సెన్స్‌లో అతడ్ని కేకలేయటం మూర్ఖుల లక్షణం, మరి ఆఫీసరు మూర్ఖుడు కాక మరెవరు?'

గుర్నాథం తన పని తను చేయటం ప్రారంభించాడు. గుర్నాథం, ఎవరయితే రాకూడదనుకున్నాడో ఆవ్యక్తి వచ్చి నిలబడ్డాడు. ఏం జరుగకూడదనుకొన్నాడో అదే జరుగబోతోందన్నమాట.

"అయ్యగారు రమ్మంటున్నారు సార్!"

"అలాగే, నువు నడు."

"అర్జెంటుగా రమ్మన్నారండి. తరవాత మీ యిష్టం." వార్త తెచ్చిన వ్యక్తి వెళ్ళిపోయాడు.

'ఓరి నీ తస్సాదియ్యా! నీకైనా కొంచెం మర్యాద తెలిసి చావదేంవిరా? ఆఫ్టరాల్ ప్యూనువి.' గుర్నాథం కదిలాడు సీటులోంచి. వీడికిది మామూలే అనుకొనే మిగిలిన స్టాఫ్‌ని, వాళ్ళకిది మామూలే అన్నట్టుగా చూస్తూ గుర్నాథం కదిలాడు హాలులోంచి.

"ఏమయ్యా గుర్నాథం! ఎంత సేపయింది నువ్వొచ్చి?" ఇది పరామర్శ కాదని తెలుసు.

"ఇప్పుడే సార్! అనుకోకుండా సైకిలు గాలి పోయింది, దారిలో చిన్న యాక్సిడెంటు లాంటిది జరగబోయి తప్పించుకొన్నాను. సారీ సార్ కొంచెం....ఆలస్యమైంది" గుర్నాథం చేతులు ఒకదాన్ని ఒకటి ఒత్తుకొంటున్నాయి. రెండు కాళ్ళ బొటనవ్రేళ్ళు ఒకదానిని ఒకటి నొక్కుకొంటున్నాయి. చూపులు నేలమీద.

"బుద్ధి లేదయ్యా నీకు? కొంచెమైనా జ్ఞానం వుంటే ఇలాంటి వెధవ పనులు చెయ్యవు. ఎన్ని రోజులు? ఎన్ని రోజులయ్యా నువ్వు నాకిలాంటి చచ్చు సమాధానాలు చెప్పి నన్ను చంపుతావు. మొన్న మీ నాయనమ్మ వచ్చిందని ఆలస్యం, నిన్ననే పెద్దమ్మ అల్లుడి తమ్ముడి కొడుకు వచ్చాడని ఆలస్యం. ఈ రోజు.... ఛీ ఛీ! నీకు సిగ్గులేదు, వెళ్ళు! నీకిదే ఆఖరి వార్నింగ్. ఇదిగో యీ ఫైళ్ళు పూర్తిచేసి పంపించు!"

అధికారం చేతుల్లోంచి ఎగిరివచ్చి, అంతస్తులేని అధికారం తెలియని ముఖాన్ని తపీమని పలకరించి, కిందికి జారి చేతుల్లో స్థిరపడ్డాయి ఫైళ్ళు. తను నడవబోయే నేల వంక చూసుకొంటూ అడుగులో అడుగు వేసుకొంటూ హాల్లోకి చేరాడు గుర్నాథం.

ఏమీ జరగనట్టు నటించబోయి, ఆఫీసరు కేకలు అందరికీ విన్పించి వుంటాయని తెలిసి, అవమానంతో ఎర్రబడిన ముఖాన్ని యథారూపం ధరింపచేయాలనే ప్రయత్నంలో బలవంతంగా చిరునవ్వు కోసం ప్రయత్నిస్తూ ఒకసారి అందర్నీ కలియచూశాడు గుర్నాథం.

'అది నీ ఖర్మరా' అన్నట్టు కొన్ని కళ్ళు, 'నీకిది మామూలేకదా!' అన్నట్టు కొన్ని కళ్ళు, 'అనుభవించు, ఇడియట్'!

అన్నట్టు కొన్ని కళ్ళు. 'మేనేజ్ చేసుకోడం ఎరుగని అమాయకుడా! లోకజ్ఞానం అలవర్చుకోరా' అనుభవాన్ని రంగరించుకొని అసలు విషయం ఇదే అన్నట్టు చూసే కళ్ళు.

'వెధవ గుమస్తా ఉద్యోగం ప్రతివాడికీ లోకువే. ఎవడు ఆలస్యంగా వచ్చినా ఫరవాలేదు. కాని, తనమీదే యెందుకిలా విరుచుకొని పడతాడు? ఖర్మకాలి ఈ రోజు నేనొక్కడ్నే ఆలస్యంగా రావాలా?'

'అటు యింటి సమస్యలు ఆఫీసుకు తొందరగా రానీయవు, ఇటు ఆఫీసు గొడవలు సుఖంగా యింటికి పోనీయవు. పని అందరికంటె తొందరగా చేసినా గుర్తింపు వుండదీ ఆఫీసరుకి. టైముకి వచ్చి బసవరాజులా రోజంతా నిద్రపోయినా ఫరవాలేదు. అయినా బసవరాజుకి టైపిస్టు ఉద్యోగం రావడానికి యేదో మంత్రిగారు కారణమని చెప్పుకొంటారు అందరూను. ఆఫీసరు పనేమయినా బసవరాజు చేతిలోవుందేమో!'

సాయంత్రం ఆఫీసు వదిలాక ఒంటరిగా, తీరికగా నడుస్తూ ఇంటికి ప్రయాణం చేస్తున్నాడు గుర్నాథం.

'పాపం ఏం విసుక్కోకుండా అయిదు సంవత్సరాలనుంచి చాకిరీ చేస్తోంది విశాలి. ఇదిగో నీ శ్రమకి నా కానుక అని ఏనాడూ మంచి చీరైనా కొని ఇవ్వలేకపోయాను. కనీసం మాటవరసకైనా కొనిస్తానులే అనలేకపోయాను. వెధవ గుమాస్తా బతుకు ఏమివ్వగలదు. కావాలనుకుంటే దాని ఒళ్ళో తల పెట్టుకొని ఏడ్వగలను. అది తప్ప మరో ఆస్తి ఏది?'

గుర్నాథం ఇంటికి చేరుకున్నాడు.

పక్కింటి రామలక్ష్మిగారు గుర్నాథాన్ని చూసి పైట సర్దుకొని లోనికి పోయింది. వాకిట్లో ఆడుకొంటూన్న పిల్లలు గుర్నాథాన్ని చూసి, 'అమ్మా నాన్నగారొచ్చారే' అంటూ గభాల్న వచ్చి గుర్నాథం మెడ పట్టుకొని వేళ్ళాడుతూ తండ్రిని ముద్దుల్లో ముంచేశారు. వరండాలో కూర్చొని బొమ్మలు గీస్తూన్న పెద్ద కొడుకు పరమేశం, తండ్రిని చూసి గబగబా పుస్తకం తీసి చదువుకోవడం మొదలుపెట్టాడు.

గుమ్మంలో గృహలక్ష్మి విశాలి చిరునవ్వుతో స్వాగతం పలుకుతూంది.

గుర్నాథం ఇంట్లో అడుగుపెట్టాడు.

"నాన్నగారూ! మేం పది నిమిషాలు ఆడుకొంటామండి. ఆడుకోమంటారా?"

"నాన్నగారూ! మీ రాఫీసునుంచి రాగానే గుర్తు చెయ్యమన్నారే! ఆ పని నేనే చేసేశాను."

"ఏవండీ పక్కింటి సుభద్రమ్మగారింట్లో పేరంటం జరుగుతోంది వెళ్ళమంటారా? మిమ్మల్నడిగి వెళ్దామని యింతసేపు ఏ నిర్ణయానికీ రాకుండా కూర్చున్నాను."


గుర్నాథం కళ్ళల్లో నీళ్ళు నిండుకున్నాయి. అంతు తెలియని ఆనందం, గర్వం అతనిలో చోటు చేసుకొన్నాయి. గోడకి చిన్నప్పుడు తను రాజుగారి వేషంలో తీయించుకొన్న ఫొటో తన వంకే చూస్తున్నట్టుంది.

---

**ఉగాది మినీకథల పోటీలో రెండవ బహుమతి రు. 150/- పొందిన కథ**

---

క్రాఫీ తాగి బయటపడ్డాం నేను, సుబ్బారావు. సినిమాకి వెడదామా వద్దా అనుకుంటుంటే కనబడ్డాడు ఆనందరావు.



# బహుమతి పొందిన కథ

ప్రకాష్

సుబ్బారావు పరిచయాలు మొదలుపెట్టాడు. "ఇతను ఆనందరావని నీకు చెప్పానుగా 'తెలుగు నేల' సబ్ ఎడిటర్...." అతను నా గురించి చెప్పబోతుంటంగా ఓ కుర్రాడు_దాదాపుగా పన్నెండేళ్ళు వుంటాయి - మా మధ్యలోకి వచ్చాడు. వచ్చి "బాలానగర్ ఎట్టాపోవాలి?" అని అడిగాడు నన్ను ఉద్దేశించి.

నేను వెంటనే జవాబు యివ్వలేదు. వాడి వంకే చూశాను. బట్టలు కొద్దిగా మాసిపోయి వున్నాయి. కాళ్ళు బాగా దుమ్ముకొట్టుకుపోయి వున్నాయి. నాకు బాలానగర్ ఎక్కడో తెలుసుగాని, అక్కడనుంచి—చిక్కడపల్లినుండి ఎలా వెళ్ళాలో తెలియదు. అందుకనే "చాలా దూరం" అన్నాను.

"బస్సులో వెడతావా?" సుబ్బారావు అడిగాడు.

కుర్రాడికి కన్నీళ్ళు వచ్చాయి. "ఉప్పల్‌నుంచి నడిచి వస్తున్నాను. మహబూబ్‌నగర్ నుంచి మా అయ్య, మా అన్న దగ్గరికివెళ్ళి పైసలు తెమ్మని పంపాడు. మా అన్న ఉప్పల్‌లో పని చేస్తు